# ఆశాదీపం



మరడాంలో బస్సు దిగేటప్పటికి ఉదయం పదయింది. అక్కడ దిగింది నే నొక్కణ్నే. బస్సు దగ్గరికి రాంబాబు వస్తాడనుకున్నాను కాని, ఎందు చేతో రాలేదు. నేను వెళ్ళవలసింది కుంటినవలస. 'మరడాం' కి నాలుగు మైళ్ళ దూరం. కసికొద్దీ ఎవరో దూరంగా విసిరేసినట్టుండే ఆ ఊళ్ళో రాంబాబు ప్రాక్టీసు పెట్టాడు. ఆ ఊరు అటు రైలురోడ్డుకి, ఇటు బస్సురూటుకి కూడా కనెక్టయి లేదు. చుట్టూ చూశాను. క్రమశిక్షణతో పెరిగిన గొప్పింటి పిల్లల్లా అందంగా, ఏపుగా పెరిగి 'మా ఊరొచ్చిన మానవుడా! నీ కిదే మా స్వాగత'మంటూ మౌనరాగాలు తీస్తున్నట్టుండే పచ్చని పంటచేల ఒయ్యారి నాట్యాలు తప్ప నన్ను కుంటినవలస తీసుకెళ్ళేందుకు బండిగాని, అలాంటి మరో సాధనంగాని ఏదీ కనబడకపోవడంతో బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని సిగరెట్టు వెలిగించి కాళ్ళకి పని చెప్పాను.

కుంటినవలస చేరుకునేటప్పటికి ఒంటి గంట కావస్తూంది. ఎండ దారుణంగా ఉంది. నాలుగు మైళ్ళ నటరాజ సర్వీసులో వచ్చిన నాకు డిస్పెన్సరీలో రాంబాబు లేడనేసరికి కాళ్ళు విరిగిపోయినంత పనయింది. "డాక్టరుబాబు గజపతినగరం వెళ్ళేరు" అన్నాడు నాయుడు నామధేయుడయిన బంట్రోతు. నిరుత్సాహపు నీడలు నా ముఖంలో పొడవుగా పరుచుకోక ముందే నా ఊరు, నా పేరు అడిగి తెలుసుకుని, "తవ రొస్తారనే నన్నిక్కడ కాపలా ఎట్టేరు" అంటూ నాయుడు నన్ను డిస్పెన్సరీ వెనక నున్న ఇంట్లోకి తీసుకెళ్ళాడు. నే నొస్తే రిసీవ్ చేసుకోమని వాడికి రాంబాబు చెప్పి వెళ్ళడం వలన, నాయుడే నా స్నానపానాలకు సదుపాయాలు చేసి, మళ్ళీ దర్శనం చేసుకుంటానంటూ వెళ్ళిపోయాడు.

భోజనం చేశాక గదిలో కూర్చుని అంతా పరిశీలించాను. 'మేడంటే మేడా కాదు, గూడంటే గూడూ కాదు, పదిలంగా అల్లుకున్న పొదరిల్లు' అని చెప్పినట్టు, ఆ గది చిన్నదయినా సామాన్లన్నీ పదిలంగా పేర్చబడి, పరిశుభ్రంగా ఉంది. అది రాంబాబు అభిరుచికి నిదర్శనం. ఓ మూల దేవుడి పటం, దాని ముందున్న పూవులు ప్రతి నిత్యం పటానికి పూజలు జరుగుతున్నాయనేందుకు నిదర్శనాలుగా నిలిచి నవ్వుతున్నాయి. మరో మూల టేబిలు, దానిమీద కొన్ని మెడికల్ రిఫరెన్సు పుస్తకాలు, మరో రెండు నవలలు, ఓ కథాసంకలనం... అవి నేను వ్రాసిన పుస్తకాలే కాబట్టి వాటిమీద నా దృష్టి నిలవలేదు. టేబిలు మీద నల్లగా మెరుస్తున్న 'ఆల్బం' మాత్రం తీపి, చేదు కలిసిన జ్ఞాపకాల ముద్దలా ఉంది. దాన్ని తీసుకుని తిరగేస్తే మొదటి లీఫ్‌మీదే 'లత' ఫొటో కనిపించింది.

సంవత్సరం క్రితం రాంబాబు జీవిత గ్రంథంలో కొన్ని పుటల్లో సజీవంగా నిలిచిన లత. అతని జీవితంలో కొన్నాళ్ళ పాటయినా వెలుగురేఖల్ని ప్రసరించిన ప్రేమచంద్రిక. రాంబాబు వైద్యం అభ్యసించిన డాక్టర్ మాత్రమే కాదు— ప్రేమను ప్రేమించి, సౌందర్యాన్ని ఆరాధించే—ఆరాధకుడు. లతను రాంబాబు ప్రేమిస్తే, రాంబాబు వ్యక్తిత్వాన్ని లత

ఆరాధించింది. అవన్నీ నా మనసులో మరపురాని జ్ఞాపకాలుగా ఇంకా బతుకుతున్నాయి. వారి పెళ్ళికి రాంబాబు తలిదండ్రులు అంగీకరించలేదు. వాదోపవాదాలు జరిగాయి. అందులో నేను రాంబాబును బలపరుస్తూ మాట్లాడాను. నాకు వాళ్ళింట్లో ఆ చనువు, స్వతంత్రము ఉన్నాయి. కానీ మా వాదన ఫలించలేదు. చివరికి మా మిత్రబృందం, అంటే డాక్టర్ విశ్వనాథం, డాక్టర్ ఏడవ్ప, సత్యనారాయణ, వెంకట్రావు, ప్రకాశరావుల సలహా, ప్రోత్సాహాలతో రాంబాబు లతను రిజిస్టరు మారేజీ చేసుకున్నాడు. నేను, సత్యనారాయణ సాక్షిసంతకాలు చేశాం. వెన్నెలొచ్చిందని సంతోషించేలోగా, మేఘాలు వెన్నెల్ని, చంద్రుణ్ణి మాయం చేసి మబ్బులు కమ్ముకోవడం కొన్ని సందర్భాల్లో జరుగుతూంటుంది. వెన్నెల్లో సెలయేరులా గలగల సాగిపోతుందనుకున్న రాంబాబు జీవితంలో ఓ విషాదం రాక్షసంగా ప్రవేశించింది. ప్రతి మనిషికి రక్తమాంసాలు ఉండటం ఎంత సహజమో, విషాదంకూడా ఉండటం అంతే సహజమే నేమో? విషాదం లేని జీవితం ఉందంటే నమ్మవచ్చును గాని, విషాదం లేని జీవితం ఉండదనుకుంటాము. అయితే, మనుషులెన్ని రకాలుగా ఉంటారో, వారి బాధలు, బాధల బరువుకు జారే కన్నీటి వెనకాలగల కారణాలుకూడా అన్ని రకాలుగా ఉంటాయేమో ననిపిస్తుంది.

సాగుతున్న ప్రేమ సూత్రాల్ని టపవ తెంచుతూ లత చచ్చిపోయింది. పెళ్ళయి నెల దాటకముందే, మరో పెళ్ళికి వెళ్ళి అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకుపోయి దారుణంగా చనిపోయింది. ఆమె చావుతో రాంబాబు జీవన్మృతుడులా తయారయాడు. 'కాజ్ అండ్ ఎఫెక్ట్' మీద ఆధారపడిన వైద్యంలో డిగ్రీ సంపాదించిన రాంబాబు కర్తవ్యాన్ని మరిచిపోయి కన్నీళ్ళతో కాపరం చేయడం మాకు బాధ కలిగించింది. గాయపడిన మనసుకో ఉపశమనం అన్వేషిస్తుండగా రాంబాబు ఓ రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకోబోయాడు. అదృష్టవశాత్తు ఆ టైముకి విశ్వనాథం, ఏడమ్మ వెళ్ళడం చేత వాడి నా ప్రయత్నం వించి విరమింపజేశారు. మరునాడు మా మిత్రబృందం మధ్య రాంబాబును కూర్చో బెట్టి అతనికి తలా కాస్త ధైర్యం చెప్పాం. "నేనూ మనిషినే. నాకూ మనసు, మమత, కన్నీళ్ళు, ఆవేశాలు ఉంటాయి" అన్నాడు దిగులుగా.

"కావచ్చురా, నువ్వు చెప్పినవి అందరికీ ఉంటాయి. కాని, వాటితో పాటు నీకు మనోదౌర్బల్యంకూడా ఉంది. నీకు చెప్పగలిగే వయసు లేకపోయినా, నీ కంటే జీవితాన్ని చూశాను కనక చెపుతున్నాను. జీవితాన్ని మనం ప్రేమించకపోతే అదీ మనల్ని ప్రేమించదు. జీవితం మన చేతుల్లో లేదు. దాని చేతిలో మనం ఉన్నాం. జీవితాన్ని మన కంట్రోల్‌లో ఉంచాలనుకోవడం, పర్వతాన్ని పిడికిట్లో దాచాలనుకోవడమే. ఆ మర్రిచెట్టుని చూడు, తనకి తెలియకుండానే ఎంతో మందికి నీడ నిస్తూ తన జీవితానికో ప్రయోజనాన్ని కల్పించుకుంటూంది. మరి అలాంటిది నీ లాంటి డాక్టర్ ఇలా మానసిక దౌర్బల్యాన్ని జయించక ప్రాణాలు తీసుకోవడం తెలివయిన పని కాదు. పది మందికి పనికొచ్చే వస్తువును పాడు చెయ్యడం ఎవరికీ మంచిది కాదు. నీ సంగతీ అంతే. నిన్ను చంపే హక్కు ఎవరికీ లేనట్టే, నిన్ను నువ్వు చంపుకునే హక్కు నీకూ లేదు. జీవితంతో రాజీ పడి బతుకుతూనే మన ఆశల్ని తీర్చుకుంటూ, ఆశయాల్ని నెరవేర్చుకోవాలి. జీవితం వ్యక్తి కంటే బలమయింది. దాన్ని మన బానిసగా చేసుకోలేం. అలాగని దానికి లొంగిపోమనను. కాని, జీవితంతో చేయి కలిపి సాగిపోవడం నేర్చుకోవాలి..." అంటూ నా అనుభవాన్ని మాటల రూపంలో రాంబాబు హృదయంలోకి ఇంజక్ట్ చేశాను.

మా ప్రయత్నం ఎంతవరకు ఫలించిందోగాని, రాంబాబు కొంత స్థిమిత పడ్డాడు. అడవిలోని పులి సైతం చెప్పవలసిన పద్ధతిలో చెపితే మనిషి మాట వింటూ విన్యాసాలు చేస్తున్నప్పుడు

**ఎస్. కాశీ విశ్వనాథం**

మానసికంగా, వైజ్ఞానికంగా ఎదిగిన రాంబాబు మమ్మల్నర్థం చేసుకోడా? ఏదయినా పల్లెటూళ్ళో ప్రాక్టీసు పెడతానన్నాడు రాంబాబు. నెల తిరక్క ముందే వెంకట్రావు తన సొంత ఊరెళ్ళి, అంటే కుంటినవలసవెళ్ళి డిస్పెన్సరీ పెట్టడానికి తగిన ఏర్పాట్లు చేశాడు. ఆ పల్లెటూళ్ళో రాబడి సంగతెలా ఉన్నా రాంబాబుకి పిడికెడు మనశ్శాంతి లభిస్తే చాలని మేమంతా సంతోషించాం.

లత మరణంతో వాడి మనసులో ఏర్పడిన చీకటిగదిలో ఏ నాటికయినా కాంతిపుంజం విలవకపోదని, ఆ వెలుగు రేక వాడికి పునర్జీవితం ప్రసాదించక పోదని నా కో పెద్ద ఆశ! నేను నాటకం వ్రాయడానికి సెలవు పెట్టి ఉన్నానని తెలిసి, తనతో పాటు నాలుగు రోజులు గడిపి వెళ్ళమని ఉత్తరం వ్రాయడంతో నేను ఆ ఊరు వెళ్ళవలసి వచ్చింది.

సాయంత్రం నాలుగు గంటల వేళప్పుడు రాంబాబు వచ్చాడు. వాడి ముఖంలో పలచటి అలసట కనిపిస్తున్నా నన్ను చూడగానే అలసట ఎగిరిపోయి ఆ స్థానంలో పున్నమి నాటి కడలి పొంగు కనిపించింది. ఆ మాటా, ఈ మాటా అయ్యాక అయిదున్నరప్పుడు డిస్పెన్సరీ ఓపెన్ చేశాడు. అక్కడ నేనూ మరో కుర్చీ వేసుకుని కూర్చున్నాను. నేను ఊహించిన దానికంటే బాగానే ఉంది ప్రాక్టీసు. ఓ గంట తరవాత పేషెంట్సు అంతా వెళ్ళిపోయారు. వేసవికాలం కావడం చేత ఏడు కావస్తున్నా ఇంకా చీకటి ముసురుకోవడం లేదు. "పని పూర్తయితే చెప్పు. అలా పొలాలంట వెళదాం. పల్లెటూరు సోయగాలు చూడాలంటే సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమానం తరవాతే చూడాలి" అన్నాను సిగరెట్ వెలిగిస్తూ.


'నువ్వు చెప్పిందే కరెక్టురా" అంటూ టైమ్ చూసుకుని, "వెంకయ్య ఇంకా రాలేదు" అని తనలో తనే అనుకుంటున్నట్టుగా బయటికే అన్నాడు.

"వెంకయ్యెవరు?" అన్నా న్నేను.

"నేను జీవించడానికి ఇన్స్పిరేషన్ ఇచ్చినవాడు" అన్నాడు నా వైపు చూసి నవ్వుతూ.

నాకు ఆశ్చర్యం వేసింది. నిజం చెప్పాలంటే కొంచెం బాధకూడా కలిగింది. వాడికి జీవితం మీద ప్రేమ కలిగించి, ప్రాక్టీసు పెట్టించింది మేం. కాని, ఆ క్రెడిట్ మరెవరికో ఆపాదిస్తున్నాడు. నేను ఆ విషయమే అడిగేలోగా పెళ్ళు మన్న దగ్గు వినిపించింది. తిరిగి చూస్తే గుమ్మం దగ్గర బాణంలా వంగిపోయిన ఓ ముసలాడు కనిపించాడు.

"అతనే వెంకయ్య" అన్నాడు రాంబాబు. వెంటనే రాంబాబు నవజీవన దాత వైపు చూశాను. అతని వయసు డెబ్భై పైమాటే. చిన్న గాలి తాకిడికి రాలిపోయే పండుటాకులా ఉన్నాడు. అతని చేతికర్ర అతని కంటే ముసలిది. అతని ముఖం నిళ్ళ తరబడి వర్షాలెరగని



భూమిలాగ బీటలు వారి కనిపిస్తోంది. అంతేకాదు, ఎన్నాళ్ళుగానో దీపం వెలగని చీకటి గదిలా, నిస్తేజంగాకూడా కనిపిస్తోంది. చీకటి వేళ్ళాడుతున్న అతని ముఖంలో వెలుగుతున్న రెండు కళ్ళు చీకట్లో తిరుగుతున్న రెండు మిణుగురుల్లా — మెరుస్తున్నాయి. నిదానించి చూస్తే, రూపం దిద్దుకున్న నైరాశ్యంలా ఉన్నాడు. మాసిన పంచె, చినిగిన కమీజు, పైమీద ఓ తువాలు — ఇదీ వెంకయ్య రూపం.

వెంకయ్య రాగానే రాంబాబు ఓ ఇంజెక్షన్ చేశాడు. సూది ఎక్కించడానికి ఇంత కండకూడాలేదు వెంకయ్య ఒంట్లో. ఇంజెక్షన్ చేస్తున్నప్పుడు, ఆ బాధకి ఓర్వలేక, కంటికి బుగ్గలకి మధ్య ఏడుపుకి నవ్వుకి మధ్య గల రెడ్‌లైన్స్ లాంటి ముడతలు బాధగా ముడుచుకోవడం చూసి నా మనసు ద్రవించింది. అంత బాధ పడుతూ ఈ వయసులో ఇంజెక్షన్ తీసుకోకపోతేనేం అనిపించింది.

"మొన్న ఇచ్చిన మాత్రలు వాడుతున్నావా?" అన్నాడు రాంబాబు. వాడుతున్నట్టుగా తల ఊపాడు. అతను రెండు చేతులెత్తి నమస్కరించి మళ్ళీ మెల్లిగా వెళ్ళబోతుంటే— "మళ్ళీ మీ వాడి దగ్గర్నించేం ఉత్తరాలు రాలేదా?" అన్నాడు రాంబాబే. "విన్న తమరికి సూపెట్టించే. . . మల్లా ఇయ్యాలేం రాలేదు" అన్నాడు ఎక్కడో నూతిలోనించి మాట్లాడుతున్నట్టు. మాట్లాడేటప్పుడు అతని పెదవులు ఎండిపోయిన నిమ్మతొనల్లా కదిలాయి.

"పట్నం నించి ఉత్తరం రావాలి గదా? వస్తుందిలే" అని రాంబాబు చెప్పడంతో వెంకయ్య మరోసారి దణ్ణం పెట్టి బయటికి వెళ్ళిపోయాడు.

తరవాత మేం ఇద్దరం బయటికి బయలుదేరాం. గాలి చల్లగా వీస్తోంది. ఆకాశం నీలిమబ్బు రంగు చీర కట్టుకుంది. పడమటి కొండల్లోకి జారిపోతున్న సూర్యబింబం ఆకాశదేవత నుదుట దిద్దుకున్న సిందూరపు బొట్టులా మెరుస్తోంది. పచ్చ కంబళి పరిచినట్టున్న పచ్చికతిన్నెమీద కూర్చున్నాక — "ఇప్పుడు చెప్పు" అన్నా న్నేను, నేనో సిగరెట్ అంటించి, వాడి కో సిగరెట్ ఇచ్చి. వాడూ సిగరెట్ వెలిగించి అన్నాడు:

"జీవితం చాలా చిత్రమయిందిరా, కాశీ. కష్టాలు ఒక్కుమ్మడిగా మనిషి మీద దాడి చేసినప్పుడు, వాటి ఒత్తిడికి తట్టుకోలేక మనిషి మనసు చావు వైపు మొగ్గినా, అది తాత్కాలికమైన ఆవేశమే తప్ప మనిషి నిజంగా చావు కోరుకోడు. ఉదాహరణకి వెంకయ్యను చూడు. అతని వయసు, రూపం చూశావు గదా? అలాంటి వాడు ఇంకా బతకాలనే కోరుకుంటూ నా దగ్గరికి ప్రతి రోజూ వచ్చి ఇంజెక్షన్ తీసుకోవడం నీకు ఆశ్చర్యంగా తోచి ఉంటుంది. నాకూ మొదట్లో అలానే అనిపించింది. కాని, అతన్ని 'స్టడీ' చేసిన తరవాత అతన్నించి నేను చాలా నేర్చుకున్నాను. వెంకయ్యకి పట్నంలో రిక్షా లాగుతున్న ఒక్కగా నొక్క కొడుకు తప్ప మరెవరూ లేరు. ఇక్కడతనికి మూడు పూటలా తిండి కూడా కష్టమే! అతను జీవితాన్ని దాదాపు అనుభవించేసినట్టే! వర్తమానంలో 'బాధ' భవిష్యత్తులో ఏ కొన మెరుపూ కనిపించని జీవితం అతనిది. అయినా, అతను బతుకుతున్నాడు. బతకాలని బాధ పడుతూనే మందులు మింగుతున్నాడు. ఎందుకోసం? ఎప్పుడో పారిపోయిన కొడుకు పట్నంలో రిక్షా లాగుతూ బతుకుతున్నాడు. వాడెప్పుడో ఓ రోజు వచ్చి తనతోపాటు ఉండిపోతాడనో, లేక వాడి వెంట వెళ్ళిపోయి అక్కడే బతకాలనో... అదేమిటయితే కానీయి, అతని ఆశ కొడుకు చుట్టూ బలంగా అల్లుకుపోయింది. అల్లుకున్న ఆ తీగల్ని తెంపే శక్తి ఎవరికీ లేదు. అతను బతుకుతున్నది కొడుకు కోసం. పస్తులుంటూ, వయసు మోస్తూ, బాధలు పడుతూ వెంకయ్య బతగ్గా లేనిది, రోగాన్ని నివారించే, వైద్యం నేర్చుకుని పది మంది బాధల్ని పోగొట్టగలిగే నేను ముప్ఫై మూడేళ్ళు దాటకుండానే జీవితానికి 'గుడ్‌బై' కొట్టడమేమిటని నాలో నేనే ఆలోచించుకున్నాను. నా ఆలోచనే నాకు బలమిచ్చింది. బతుకుమీద ఆశను నింపింది."

సిగరెట్ ఆఖరి దమ్ము లాగి దూరంగా విసిరేసినా వైపు చూశాడు. నేను, మిగిలిన స్నేహితులు చెప్పిన అనేకమయిన మాటలకన్నా, కదిపితే ఒకటి రెండు మాటలు మాత్రమే మాట్లాడే వెంకయ్య, రాంబాబు జీవన ప్రమిదలో చమురు నింపి, వత్తి వెలిగించడం నా ఊహకందని విషయం. ఆ రాత్రంతా ఈ విషయం గురించే ఆలోచించాను.

మరునాడు నేను గదిలో కూర్చుని వ్రాసుకుంటున్నాను. రాంబాబు డిస్పెన్సరీలో పేషెంట్సుని చూస్తున్నాడు. నే నున్న గదికి, డిస్పెన్సరీకి మధ్య దారి ఉంది. నేను కూర్చున్న చోటనించి చూస్తే రాంబాబు, వాడి దగ్గరి కొచ్చే పేషెంట్సు స్పష్టంగా కనపడతారు. దీక్షగా వ్రాసుకుంటున్న నేను పరిచితమయిన దగ్గు వినిపిస్తే తలఎత్తి ఆ గది వైపు చూశాను. అక్కడ వెంకయ్య కనిపించాడు. అతనికి రాంబాబు ఇంజెక్షను ఇవ్వడం లేదు. వెంకయ్య ఇచ్చిన ఉత్తరం చదివి వినిపిస్తున్నాడు.

". . . నీ కొడుకు సొంతంగా రిక్షా కొనుక్కోవాలని ప్రయత్నిస్తున్నాడట. అందుచేత రాత్రీ, పగలూకూడా రిక్షా తొక్కి డబ్బు సంపాదిస్తున్నాడట.





ఇంకో ఆరేడు నెలల్లో రిక్షా కొనుక్కోగలనంటూ రాశాడు" అన్నాడు రాంబాబు ఉత్తరం అతనికి ఇచ్చేస్తూ.

చీకటి పువ్వులాంటి వెంకయ్య ముఖం మీద కనీ కనిపించని వెలుగురేఖ నీరసంగా మెరిసింది. రెండు చేతు లెత్తి దణ్ణం పెట్టి, "ఏదో తమరి దయ వల్ల ఆడు సొంతంగా రిచ్చా కొనీసుకుంటే . . ." అంటూ ఇంకా ఏదో చెప్పబోయి, దగ్గుతెర అడ్డు రావడంతో చెప్పలేక రెండు చేతు లెత్తి ఆకాశం వైపు దణ్ణం పెట్టాడు.

"ఈ వేళ ఇంజీసను అక్కర్లేదా, బాబూ?" అంటూ వెంకయ్య ఉత్తరం మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"అక్కర్లేదు, వెంకయ్యా. మళ్ళా రెండు రోజుల తరవాతే. మాత్రలు మాత్రం వేసుకుంటూండు." రాంబాబుకి మళ్ళా నమస్కరించి వెంకయ్య మెల్లిగా వెళ్ళిపోయాడు.

కలం ముడిచి రాంబాబు దగ్గరి కెళ్ళాను. "ఇంక పేషెంట్సు అయిపోయి నట్టే. అలా తిరిగొద్దామా?" అన్నాడు రాంబాబే. కిటికీలోంచి బయటికి చూశాను. ఆకాశం మబ్బు మచ్చల నల్లచీర కట్టుకుంది. సన్నగా తుంపర్లు రాలుతున్నాయి. "వర్షం రావచ్చేమో, కొంచెం చలిగాకూడా ఉంది. బయటి కెళ్ళొద్దు. ఇక్కడే ఉందాం" అంటూ నే నో సిగరెట్ వెలిగించి, వాడి కో సిగరెట్ ఇచ్చి వెలిగించాను.

"రాత్రంతా వెంకయ్య గురించే ఆలోచించాను" అన్నాను నేను.

"నువ్వు ఆలోచిస్తావని నాకు తెలుసు. ఎంతయినా పెద్ద రచయితవి కదా!" నవ్వాడు రాంబాబు.

"నవ్వు కాదురా, రాంబాబూ, నిజం చెపుతున్నాను. వెంకయ్య లాంటి పూర్ణ జీవితాన్ని అనుభవించిన మనిషికి ఇంకా బతుకుమీద తీపి కలిగిస్తున్న ఆ దేవుడి మనస్తత్వం ఏమిటో అంతు బట్టడం లేదు."

"అంటే?"

నేను కాసేపు మాట్లాడలేదు. తరవాత— "వెంకయ్యని బతికిస్తున్న నీ మందులు, మందుల రూపంలో ప్రకృతి అతని కిస్తున్న ఉత్తేజం. ఈ వయసులో వైద్యసహాయం లేకపోతే అత నీపాటికి మరణించి ఉండేవాడు. అవునా?" అన్నాను.

న న్నో పావు నిమిషం తదేకంగా చూసి రాంబాబు అన్నాడు: "యూ ఆర్ రాంగ్, కాశీ, వెంకయ్యనిబతికిస్తున్నది నా మందులు కాదు."

"మరి?"

"అతనికి జీవితం మీదున్న ఆశ. అతనే కాదురా, ప్రతి మనిషి ఏదో ఆశతోనే జీవితాన్ని గడుపుతాడు. వర్తమానంలో ఎన్ని బాధ లనుభవించినా, భవిష్యత్తులో ఏదో సుఖాల పల్లకీ తన కోసం ఎదురురాకపోతుందా అనే భవిష్యత్తు వైపు ఆశగా చూస్తూ గడిపేస్తాడు. ప్రతి క్షణం తన జీవితపు ప్రమిదలో చమురు నింపుకుని వత్తిని ఎగదోసుకుంటుంటాడు."

నేను స్తబ్దణ్ణై వింటున్నాను.

"ఆశ శ్వాసలాంటిదిరా. మనిషి బతికినంత కాలం శ్వాస ఉంటుంది. ఒకటి సైన్సు; ఒకటి జీవితం." నేను వాడి మాటలి కడ్డొచ్చాను.

"అయితే, నువ్వు చెప్పే దేమిటి? వెంకయ్యను బతికిస్తున్నది నీ మందులు కావంటావా?"

"ముమ్మాటికీ కాదు. వెంకయ్యకి తన కొడుకు మీద ప్రేముంది. అందుకే అతని ఆశలన్నీ కొడుకు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. ఎప్పుడో తన నించి పారిపోయిన కొడుకు ఏదో ఓ రోజున తన దగ్గరికి రాకపోడన్న నమ్మకంతో శ్వాస పీల్చుకుంటున్నాడు."

"రేయ్, రాంబాబూ, నీ వాదాన్ని

ఖండించాలని కాదు గాని, నువ్వు చెప్పే దానిలో నలభై శాతం నిజం, అరవై శాతం అతిశయోక్తి ఉన్నాయి. ఎలా గంటావా? మనిషిని బతికించేది ఆశ! ఒప్పుకుంటాను. ఈ విషయం మీద నేనూ కథలు రాశాను. కాని, వాస్తవంలో అది ఎంతవరకు నిజమని ఆలోచించు కుంటే ఇందాక చెప్పిన నిష్పత్తే అన్న రొస్తుంది. . .''

రాంబాబు లేచి వెళ్ళి సిగరెట్ కిటికీలో నించి విసిరేశాడు. చల్లగాలి రయ్‌మంటూంది. కుర్చీలో మళ్ళీ కూర్చుని రాంబాబు అన్నాడు: ''నువ్వు రచయితవి, నేను డాక్టర్ని. చెదిరిపోయిన మనసులకి నువ్వు మాటల ద్వారా వైద్యం చేసి బాగుపరచగలవు. జబ్బు పడిన శరీరాలకి మందుల ద్వారా నేను నయం చేయగలను. అయితే, మనిద్దర్లోంచి అసలైన మనుషులు బయటపడి 'జీవితం' గురించి ఆలోచిస్తే నేను చెప్పిందే నిజమని బుజువవుతుంది. కావాలంటే ఆలోచించు.''

''ఎలా ఆలోచించినా అది అంతేరా. పోనీ వెంకయ్య కేసే తీసుకో. అతను బతుకుతున్నది ఏదో ఆశతో నంటున్నావు. నువ్వు రేపటినించి మందు లివ్వడం మానేయి—ఏం జరుగుతుందో చూద్దాం'' అన్నాను ఛాలెంజి చేస్తున్నట్టుగా.

రాంబాబు మౌనం వహించాడు. వర్షించబోయే మేఘంలా ఉంది వాడి ముఖం. ''వెంకయ్యకి నే నిస్తున్న మందులు అతన్ని బతికించడానికేమీ ఉపయోగపడవు. నేను అతన్ని 'చెకప్' చేసేసరికే అతని కండిషన్ హోప్‌లెస్‌గా ఉంది. నేనే కాదు, ఏ ఎక్స్‌పర్టయినా అతని గురించి హోప్స్ ఉంచుకో లేడు. అతనికి నే నిస్తున్నవి 'బి' కాంప్లెక్స్ ఇంజెక్షన్లు— అంతే!''

నాకు ఆశ్చర్యం వేసింది. ''మరే మందులూ ఇవ్వడం లేదా?''

''లేదు. నిజానికి అక్కర్లేదుకూడాను. అయితే, అతని కొడుకు నించి వచ్చే ఉత్తరాలే అతనికి బలాన్ని, ఆశని ఇస్తున్నాయి.''


''నే నమ్మను. నువ్వు మరీ ఊహా పథంలో ఎగురుతున్నావు. ఊహకీ, వాస్తవానికి తేడా తెలియని వెర్రివాణ్ణి కాదు.'' నాకు ఆవేశం వచ్చింది.

''సరే అయితే. నే నో రహస్యం చెపుతాను, విను'' అంటూ ఆగి, ''వెంకయ్య కొడుకు ఇప్పు డెక్కడున్నాడో తెలుసా?'' అన్నాడు.

తెలియదన్నట్టుగా తల ఊపాను.

''ఈ లోకంలో లేడు.''

''అంటే?''



సోపాన పంక్తి

ఫోటో: [illegible] (మద్రాసు)

''చచ్చిపోయాడు. రెండు నెలల క్రితం.''

''ఈజిట్?''

''అవ్వా. రెండు నెలల క్రితం లారీ ఏక్సిడెంట్‌లో చచ్చిపోయాడు. వెంకయ్యని తెలిసిన వాళ్ళెవరో ఉత్తరం రాశారు. అయితే, అప్పటికే వెంకయ్య తన కొచ్చిన ఉత్తరాన్ని నాతో చదివించు కోవడానికి కలవాటు పడ్డాడు. ఆ రోజు ఆ ఉత్తరంకూడా నేనే చదివాను గాని, అతని కా విషయం చెప్పకుండా కాస్సేపు ఆలోచించాను. నేను ఆత్మహత్య చేసుకోబోయినప్పుడు నువ్వు చెప్పిన మాటలు నువ్వు మరిచిపోయినా నేను మరిచిపోలేదు. నన్ను నేను చంపుకునే హక్కు నాకు లేనట్టే, మరొకర్ని చంపే హక్కూ నాకు లేదు. ఉత్తరం లోని నిజం చెపితే ఆ ముసలిగుండె పగలచ్చు. నా దగ్గరి కొచ్చిన పేషెంటుని మందు లిచ్చేనాదు, మాయ మాటలు చెప్పయినా బతికించాలి. మనిషిగా అది నా కర్తవ్యమనిపించి, ఉత్తరంలోని నిజం దాచి, అతని కొడుకు క్షేమంగా ఉన్నట్టు అబద్ధం చెప్పాను.'' వాడు ఆగాడు.

''మ రయి తే ఇప్పు డొ స్తు న్న ఉత్తరాలు. . .''

''నేను రాస్తున్నవే! వెంకయ్య కొడుకు మరణం తరవాత నేనే వాడావికో ఉత్తరం రాసి, గజపతినగరం వెళ్ళినప్పుడల్లా అక్కణ్ణించి పోస్ట్ చేస్తున్నాను. అది అందుకుని, తిరిగి నా చేతే చదివించు కుంటున్నాడు. వెంకయ్య నాకు పరిచయమయినప్పటికీ, ఇప్పటికి అతని ఆరోగ్యం చాలా మెరుగయింది. ఇప్పుడు చెప్పు, అతన్ని బతికిస్తున్న దేమిటో?'' రాంబాబు ఆగి, రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు.

ఆ క్షణంలో రాంబాబు నా కంటికి డాక్టర్‌లా కనిపించ లేదు. గొప్పమనస్తత్వ శాస్త్రవేత్తలా కనిపించాడు.

దాదాపు ఆ రాత్రంతా నా మనసు ఆలోచిస్తూనే ఉంది. ఆలోచనల్లోనే వెంకయ్య, రాంబాబు. . . వీళ్ళిద్దరి మధ్య శూన్యం లాంటి వెంకయ్య కొడుకు. . .

మరునాడు సాయంత్రంకూడా వర్షపు తుంపర పడటంతో పేషెంట్లు ఎక్కువ మంది రాలేదు. మూడవ నాడు వాతావరణం నిర్మలంగా ఉంది. పేషెంట్లు మామూలుగానే వచ్చారు. అందరూ అయ్యాక— ''అలా బయటికి వెళదామా?'' అన్నా న్నేను రాంబాబుతో.

''వెళదాం— వెంకయ్యకి ఇంజెక్షనిచ్చి. . .'' అంటూ రాంబాబు వాచీ చూసుకున్నాడు. పావు తక్కువ ఏడు. ఏడున్నర వరకు వెయిట్ చేసినా వెంకయ్య రాలేదు. బంట్రోతు నాయుణ్ణి పిలిచి అడిగాడు రాంబాబు ''వెంకయ్య రాలేదా'' అని. దానికి నాయుడు ఏదో ముఖ్య విషయం చెప్పబోయి మరిచి పోయినట్టు నాలిక కరుచుకుని, ''తమరికి సెప్దామనుకుంటూనే మర్సిపోయానండి . . . నిన్న మద్దేనగట్ల వెంకయ్య సచ్చిపోనాడండి'' అన్నాడు.

''వాట్!'' అన్నాం మే మిద్దరం ఆశ్చర్యంగా.

''అవును,బాబూ. తమరికి సెప్దామనుకుంటూనే. . .'' నాయుడు. రాంబాబు భృకుటి ఏదో సంశయంతో ముడి పడింది. ''నాయుడూ, మొన్న రాత్రి వెంకయ్య ఇక్కణ్ణించి బయటి కెళ్ళి మా మాటలు విన్నాడా?'' అన్నాడు ఆత్రంగా.

నాయుడు తల గోక్కుని ఆలోచించి, ''అవును, బాబూ, వెంకయ్య తమరి దగ్గర్నించి వచ్చేటప్పుడు అడి పై మీద తువాలు తమ టేబిలు దగ్గర పడిపోయిందట, తిరిగి వెళ్ళి తీసుకుందామనుకుంటుండగా మన కాశీబాబు తమరితో మాట్లాడ్డం చూసి, లోనికి రావడానికి సంశయించి తలుపు దగ్గరే నిలబడి పోనాడు. ఒకేళ అప్పుడు తమరాడుకున్న మాటలు వినే ఉంటాడు.''

మా కర్థమయిపోయింది.

మనసులో దాచుకున్న రహస్యం బయటపడేసరికి అది రేపిన గాలి దుమారానికి వెంకయ్య లోని ఆశాదీపం ఆరిపోయింది. రాంబాబు వెలిగిస్తున్న వెంకయ్య మనసులోని ఆశా దీపం నేను ఆ ఊరు వెళ్ళకపోయినా, వెళ్ళి ఆ రోజు అంత తీవ్రంగా చర్చించకపోయినా మరి కొన్నాళ్ళు వెలుగునేమో అని నా కిప్పటికీ అనిపిస్తుంది. ★